ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6 । కనిష్ఠం 23.4

కామారెడ్డి
జిల్లా వార్తలు
3
శనివారం 22 జూన్ 2024

టెండర్ తేదీ వాయిదా

కామారెడ్డి రూరల్, జూన్ 21: జిల్లా అల్ప సంఖ్యాక సంక్షేమ శాఖ కామారెడ్డి జిల్లా పరిధిలోని తొమ్మిది మైనారిటీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ఆహార దినుసులు, కోడిగుడ్లు, చికెన్, కూరగాయలు, పండ్లు సరఫరా చేయుటకు తేదీ జూన్ 12, 2024 నుంచి జూన్ 20, 2024 వరకు వేసిన సీల్డ్ టెండర్లు జూన్ 22, 2024 తెరవాలి. కాని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి దయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీల్డ్ టెండర్లు తెరిచే తేదీని త్వరలో తెలియజేస్తామని ఆయన తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్



హైదరాబాద్‌లో తన ఇంటికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- కాంగ్రెస్‌లో చేరిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- నేరుగా హైదరాబాద్‌లోని పోచారం నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి
- పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం
- పోచారంతో పాటు ఆయన తనయుడు కాంగ్రెస్ గూటికి
- నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మార్పు : పోచారం

కామారెడ్డి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే బీఆర్‌ఎస్‌కు బిగ్‌షాక్ తగిలింది. కేసీఆర్‌కు ఉన్న విధేయుల్లో ఒక్కరైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆ పార్టీని వీడి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బతీసినట్టే. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మంత్రితో పాటు స్పీకర్ పదవిని కట్టబెట్టిన కేసీఆర్ పోచారాన్ని లక్ష్మీపుత్రుడిగా అభివర్ణించారు. అలాంటి పోచారం అధికారం కోసం చివరగా ఆ పార్టీని వీడక తప్పలేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆ సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలోని పలువురు ముఖ్యనేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తాజాగా పోచారం చేరికతో బీఆర్‌ఎస్‌కు గట్టిదెబ్బె తగిలిందని చెప్పుకోవచ్చు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. కానీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రాలేకపోయింది. ఇదేక్రమంలో బాన్సువాడ నియోజకవర్గంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ తనపై గౌరవం తగ్గుతూ వచ్చింది. అయితే నియోజకవర్గంలో క్రమంగా పట్టుకోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నియోజకవర్గంలో పట్టుకోసం పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలుస్తోంది. అదేవిధంగా తనయులు భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిల రాజకీయ భవిష్యత్తు వారి ఒత్తిడి మేరకు పోచారం కాంగ్రెస్‌లో చేరి నట్లు అనుచరవర్గాల్లో చర్చ సాగుతోంది. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు నేరుగా హైదరాబాద్‌లోని పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. సుదీర్ఘంగా చర్చించిన అనంతరం పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి సీఎం పార్టీలోకి ఆహ్వానించారు. పోచారంతో పాటు తనయుడు భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సోదరుడు శంబురెడ్డి కాంగ్రెస్‌లో చేరారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మార్పు

రాజకీయంగా ఎలాంటి హామీలు రాకున్నా నియోజకవర్గ అభివృద్ధి కోసమే మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ మారారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. గత ప్రభుత్వ హయాం చివరలో పలు ప్రాజెక్టుల కోసం అనుమతులు తీసుకువచ్చారు. పనులు చేపట్టారు. అవన్నీ చివరి దశలో ఉన్నాయి. వాటికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మారడం వల్ల పనులకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీలో ఉంటే పనులు కావడంతో పాటు ప్రొటోకాల్ ఉండటం, అధికారులతో సమీక్ష నిర్వహించి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టే అవకాశం ఉండటంతో ఆయన పార్టీ మారినట్లు సన్నిహితులు తెలిపారు. ఆయన తనయుడు పోచారం భాస్కర్‌రెడ్డి భవిష్యత్తు కోసం కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. డీసీసీబీ ఛైర్మన్‌గా ఉన్న పోచారం భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పదవిని కోల్పోయారు. ఆయనపై బ్యాంక్ డైరెక్టర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టడంతో పదవికి రాజీనామా చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఉన్న కొన్ని పనులు కాకుండా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా పదవుల కోసం హామీలు రాకున్నా భాస్కర్‌రెడ్డికి రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు హామీలు ఇవ్వడంతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకొని పార్టీలో చేరినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. మొత్తంగా నియోజకవర్గం అభివృద్ధి కోసం ఆయన నిర్ణయం తీసుకోవడంతో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు కూడా ఆయనతో కాంగ్రెస్‌లోనే చేరేందుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో కొంత మంది కాంగ్రెస్‌లో చేరిన ప్రస్తుతం ఆయన వెంట ఉన్నవారంతా పార్టీలో చేరనున్నారు.

ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు షాక్

పోచారం శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ శ్రేణులు షాక్‌కు గురయ్యారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో శ్రీనివాస్‌రెడ్డికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం, పదవుల్లో అవకాశాలు ఇవ్వడం వల్ల ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. బాన్సువాడ నియోజకవర్గం ఉమ్మడి జిల్లా పరిధిలో ఉండటం ఆయన అనుచరులు మాత్రం ఆయన వెనకనే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఇద్దరే ఎమ్మెల్యేలు ఉండటం ప్రస్తుతం మాజీ స్పీకర్ కాంగ్రెస్‌లో చేరడం వల్ల మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి ఒక్కరే ఎమ్మెల్యేగా ఉన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సీనియర్ నేతలంతా పార్టీ వీడటం వల్ల బీఆర్‌ఎస్ కింది స్థాయి నేతలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక సంస్థల్లోగా వారు కూడా నేతలతో కలిసి కాంగ్రెస్, ఇతర పార్టీలో చేరేందుకు సన్నద్ధమవుతున్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ మారడం పట్ల బీఆర్‌ఎస్ నేతలు మాత్రం ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎలాంటి ప్రకటనలు ఇప్పటి వరకు చేయలేదు.

కాంగ్రెస్‌కు పెరగనున్న బలం

మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీకి బలం కూడా పెరగనుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉండగా ప్రస్తు తం నలుగురు కాంగ్రెస్ నుంచి ఉన్నారు. ఆయన చేరడం వల్ల ఆ సంఖ్య ఐదుగురికి పెరగనుంది. పార్టీ బలంతో పాటు ఉమ్మడి జిల్లాలో ఈ ప్రభావం ఉండనుంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మెజార్టీ సీట్లను కైవసం చేసుకునేందుకు ఆయన చేరిక ఉపయోగపడనుంది. కాంగ్రెస్‌లో పోచారం చేరికను ఉమ్మడి జిల్లా ఆ పార్టీ నేతలు ఆహ్వానిస్తుండగా బాన్సువాడలోని మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి వర్గం మాత్రం వ్యతిరేకిస్తోంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన రవీందర్‌రెడ్డి పోచారంపై పోటీ చేసి ఓడిపోయారు. ఎన్నికల తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఉన్న ఆయన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అన్ని పనులను ఆయన ఆధ్వర్యంలోనే కొనసాగే విధంగా చూశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే పార్టీలో చేరడంతో క్యాడర్ కూడా ఎక్కువ మొత్తంలో చేరనుండటం వల్ల ఉమ్మడి జిల్లా పరిధిలోని నేతలు ఆయన చేరికను ఆహ్వానిస్తున్నారు.

ఏనుగు రాజకీయ భవిష్యత్తు ఏమిటో?

బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి రాజకీయం సంక్లిష్టంగా మారింది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఏనుగు రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందోనని ఆయన అనుచరులతో పాటు నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా గెలుపొందిన ఏనుగు రవీందర్‌రెడ్డి 2018 ముందస్తు ఎన్నికల్లో ఓడిపోయారు. తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల్లో ఆయన ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి సైతం రాజీనామా చేశారు. కాంగ్రెస్ కండువా కప్పుకు న్నారు. ఎల్లారెడ్డి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించినప్పటికీ పార్టీ అధిష్ఠానం బాన్సువాడలో పోటీ చేయాలని ఏనుగుకు ఆదేశించింది. దీంతో తప్పని పరిస్థితుల్లో ఆయన బాన్సువాడ నుంచి కాంగ్రెస్ తరపున బరిలో దిగారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై ఏనుగు ఓటమిని చవి చూశారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బాన్సువాడలో ఏనుగు రవీందర్‌రెడ్డి ఓడిపోయినప్పటికీ తన ఆధిపత్యాన్ని కొనసాగించారు. ఇక బాన్సువాడ నియోజకవర్గం తమదే నంటూ తన అనుచరులు సైతం చెప్పుకొచ్చారు. ఇదే క్రమంలో పోచారం కాంగ్రెస్‌లో చేరడంతో ఏనుగు రాజకీయ భవితవ్యం సందిగ్ధంలో పడింది. ఇప్పటికే బాన్సువాడ కాంగ్రెస్‌లో ఏనుగు, కాసుల బాలరాజ్‌లు రెండు వర్గాలుగా విడిపోయారు. ఇక పోచారం చేరికను ఏనుగు వర్గీయులు వ్యతిరేకించారు. కానీ పాత కాంగ్రెస్ క్యాడర్ మాత్రం స్వాగతించింది. అయితే పోచారం కాంగ్రెస్‌లో చేరడంతో రానున్న రోజుల్లో బాన్సువాడలో ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రాధాన్యత తగ్గే అవకాశం ఉందని అనుచ రుల్లో చర్చ సాగుతోంది.



పోచారం కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూన్ 21: మహిళలను సమాజంలో భాగస్వామ్యులను చేసి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళ శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీపీఎంలు, ఏపీఎంలు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతూ మహిళ ఉన్నతి-తెలంగాణ ప్రగతి లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళ శక్తి ద్వారా 14 రకాల కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల కుట్టు పనిని వారికే అప్పగించిందని అన్నారు. జిల్లాలో 128 కేంద్రాల ద్వారా 1997 మంది మహిళ సంఘ టైలర్లచే 77,550 దుస్తులు కుట్టిస్తున్నామని, ఇప్పటి వరకు 83 శాతం దుస్తులు పాఠశాలలకు అందజేశామని, మిగితా దుస్తులను ఈనెల 25లోగా కుట్టించి అందజేయాలని ఏపీఎంలు, సీసీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీవో చందర్, లీడ్ బ్యాంక్ అధికారి రవికాంత్, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

ప్రతి నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు దరిచేరవని మానసిక ప్రశాంతత లభిస్తుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి యోగా పరిచయం చేసింది మన దేశమేనని, ఈ సంవత్సరం నాకోసం సమాజం కోసం యోగా అంశంతో కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మానవులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడానికి ఒత్తిడిని అధిగమించుటకు యోగ, ప్రాణాయామం వరప్రదాయిని అన్నారు. ప్రతిరోజూ 15-20 నిమిషాలు యోగాకు కేటాయిస్తే మనిషి ఆరోగ్యంగా ఉంటారని, ఎటువంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవని, జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని అన్నారు. అనంతరం కళాశాలను పరిశీలించి నిర్మాణం జరుగుతున్న క్రిటికల్ కేర్, వసతి గృహాల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పొగ సూరుతున్న గ్రామాలు

- ఇష్టారీతిగా చెత్తకు నిప్పంటిస్తున్న పంచాయతీ సిబ్బంది
- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకోని అధికారులు

భిక్కనూరు, జూన్ 21: ఉమ్మడి జిల్లాలోని చాలా గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్లపై ఇష్టారీతిన చెత్తను పారబోసి దానిని కాల్చివేస్తుండటంతో చాలా గ్రామాలు పొగసూరుతున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను గ్రామ సమీపంలో ఉన్న బావుల్లో, గుంతల్లో, చెరువు కట్టలపై పారబోసి గ్రామ పంచాయతీ సిబ్బంది నిప్పంటించి చేతులు దులుపుకుంటున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది వారు మాత్రం తమకు అవేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చాలా గ్రామాల్లో రోడ్లపైనే చెత్తను పారబోస్తూ రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులను వినియోగించడం లేదు. రోడ్లపై వేస్తున్న చెత్తకు నిప్పటించడంతో దాని నుంచి వచ్చే పొగ గ్రామాలను చుట్టూ ముడుతోంది. ఈ పొగ కారణంగా చాలా గ్రామాల్లో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వాహనదారులైతే చెత్తకు నిప్పంటించిన వైపు వెళ్లాలంటే జనుకుతున్న పరిస్థితి. ఈ పొగ కారణంగా రోడ్డు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా అస్తమా రోగులు ఈ పొగ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.

ఇష్టారీతిగా చెత్తకు నిప్పంటిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ఒకటి, రెండు రోజులకు ఒకసారి గ్రామాల్లో సేకరించిన చెత్తను పలు కారణాలతో గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామాలకు సమీపంలోని పాత బావులు, గుంతల్లో, చెరువు గట్టు వద్ద పారబోస్తు చెత్త రోడ్లపైకి, బహిరంగ ప్రదేశాలకు రాకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది ఇష్టారీతిగా నిప్పు పెడుతున్నారు. దీంతో ఈ చెత్త కాలుతున్నంతసేపు విపరీతమైన పొగ వస్తోంది. ఈ చెత్త నుంచి వచ్చే పొగతో దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ ఎక్కువ కాలుతుందన్న ఉద్దేశ్యంతో చాలా గ్రామాల్లో చెత్త సేకరణను రెండు, మూడు రోజులకు ఒక్కసారి చేపట్టడంతో పాటుగా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలిం చకుండా గ్రామాలకు దగ్గరలోనే పారబోస్తున్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

గ్రామాల్లో సేకరించిన చెత్తతో




సిద్ధరామేశ్వరనగర్‌లో చెత్తను కాల్చడంతో పొగ వస్తున్న దృశ్యం

సేంద్రియ ఎరువులను తయారు చేసి గ్రామ పంచాయతీలు ఆదాయం పొందడానికి రూ.లక్షలు వెచ్చించి కొన్ని గ్రామాలు మినహా దాదాపు అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు నిర్మించారు. చెత్తను సేకరించడానికి, సేకరించిన చెత్తను ఈ డంపింగ్ యార్డులకు తరలించడానికి ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. కానీ చాలా గ్రామాల్లో చెత్తను పాత బావులు, గుంతల్లో, చెరువు గట్టు వద్ద పారబోస్తుండటంతో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తడి పొడి చెత్తను వేరు చేయాలని, చెత్తను రోడ్లపై వేయొద్దని కేవలం గ్రామ పంచాయతీ ట్రాక్టర్లలోనే వేయాలని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టే గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది మాత్రం చాలా గ్రామాల్లో డంపింగ్ యార్డులను వినియోగించకపోడం కొసమెరుపు. డంపింగ్ యార్డులు నిరుపయోగంగా ఉండటంతో మందుబాబులకు అవి అడ్డాలు మారుతున్నాయి.

ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా.. పట్టించుకోని అధికారులు

చెత్తను కాల్చి వేయడంతో వాతావరణం కాలుష్యం కావడంతో పాటుగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ పొగ కారణంగా వీపరీతమైన దగ్గు, కళ్ల మంటలతో పాటుగా కళ్ల నుంచి నీరు కారడం, తలనొప్పి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించకుండా ఇలా రోడ్లపై పారబోసి నిప్పంటించడం ఏమిటని ఎవరైనా గ్రామ పంచాయతీ అధికారులను, సిబ్బందిని ఎవరైనా ప్రశ్నిస్తే ట్రాక్టర్‌లో డీజిల్ పోయిస్తారా, చెత్తకు నిప్పంటిస్తే మీకేమవుతుంది ఎవరికి చెబుతారో చెప్పుకోండంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించి రోడ్లపై చెత్తకు నిప్పంటిస్తున్న గ్రామ పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

చెత్తను డంపింగ్ యార్డుకు తీసుకెళ్లాలి



• ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో భిక్కనూరు

గ్రామంలో ప్రతిరోజూ ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను గ్రామ పంచాయతీ సిబ్బంది డంపింగ్‌యార్డుకు తరలించాలి. లేనిపోని కారణాలతో రోడ్లపై, బావులలో చెత్తను పారబోసి నిప్పంటిస్తే సహించేది లేదు. నిబంధనలను పాటించని కార్యదర్శులపై కఠన చర్యలు తప్పవు. డంపింగ్ యార్డుకు తరలించిన చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేయాలి.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జూన్ 21: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీస్ నిజామాబాద్, పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజలు అందరూ ఆరోగ్యంగా, శాంతి, సామరస్యంతో మెల గాలనే లక్ష్యంతో 2014లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతీ సంవత్సరం జూన్ 21న యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితిలో ప్రతిపాదించగా అన్ని సభ్య దేశాలు మద్దతు తెలిపాయని అన్నారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని వైభవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలంటే యోగా ఉత్తమమైన సాధనమన్నారు. మంచి ఆలోచనలు రావడానికి యోగా ఎంతో దోహద పడుతుందన్నారు. యోగా చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సూచించారు. యోగాతో ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కాలేజీ స్థాయిలో కూడా యోగాను పరిచయం చేసి విద్యార్థులు యోగా చేసేలా చూడాలన్నారు. అందులో భాగంగా 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటి ఆఫీసర్ ధర్మానాయక్, పతాంజలి యోగా సమితి అధ్యక్షుడు రామ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీలం చిన్న రాజులు, నాయకులు విపుల్‌జైన్, శ్రీకాంత్, నరేందర్, రవీందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

లోన్ ఇస్తామంటూ డబ్బులు దండుకున్న మోసగాళ్లు

ఎల్లారెడ్డి, జూన్21: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన లింగంపేట్ బాలకృష్ణ అనే వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి రూ.5 లక్షల లోన్ వచ్చిందని, అకౌంట్‌లో వేయాలంటే కొంత ఫీజు చెల్లించాలని చెప్పగా.. నమ్మిన బాలకృష్ణకు ఆ వ్యక్తులకు ఫోన్‌పే ద్వారా రూ.30,806 పంపాడు. రోజులు గడుస్తున్నా డబ్బులు ఖాతాలోకి రాకపోవడంతో మోస పోయానని గ్రహించిన బాలకృష్ణ ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు లోన్లు ఇస్తామంటూ మాయమాటలు చెబితే నమ్మి మోసపోకూడదని వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వొద్దని సూచించారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

● విద్యార్థి సంఘాల డిమాండ్

కామారెడ్డిటౌన్, జూన్21: నీట్ పరీక్షను రద్దుచేయాలని, ఎన్‌టీఏని తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం, ఎన్‌టీఏ అధికారులు కలిసి కుట్రపన్నిపేపర్‌లీకేజ్‌చేయడం జరిగిందని ఆరోపించారు. బీహార్, గుజరాత్ రాష్ట్రంలో పేపర్‌ని 30 నుంచి 40లక్షలకు అమ్ముకోవడం జరిగిందన్నారు. విద్యావిధానాన్ని కాపాడాల్సిన అధికారులే డబ్బులకు ఆశపడి పేద, మధ్యతరగతి కుటుంబాల పేదవిద్యార్థులను చదువుకు దూరం చేయాలని కుట్రలో భాగంగా పేపర్‌లీకేజ్ చేసినట్లు చెప్పారు. పేపర్ లీకేజీపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, బీవీఎం రాష్ట్రకార్యదర్శి విఠల్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'జీరో బిల్లులు ప్రతీ ఒక్కరికి వర్తింపజేయాలి'

సదాశివనగర్, జూన్ 21: ప్రభుత్వం గృహలక్ష్మి కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు అందజేస్తామని వాగ్దానం చేసినా కొందరికే జీరో బిల్లులు వస్తున్నాయని, అందరికీ జీరోబిల్లులు వర్తింపజేయాలని ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ కోరారు. గురువారం ఎంపీపీ గైని అనసూయ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు సమస్యలను లెవనెత్తారు. సదాశివనగర్ మండల కేంద్రంలో ఐదు అసంపూర్తి అంగన్‌వాడి భవనాలు ఉండడంతో చిన్నారులకు సౌకర్యాలు లేని అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారని, తక్షణమే చర్య తీసుకోవాలని మండల కోఆప్షన్ సభ్యుడు అల్తాప్ ఎంపీడీఓకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు లేకపోవడంతో చదివినట్లు చదివివినిపించి మమ అనిపించారు. ఆర్అండ్‌బీ శాఖ, ఎక్సైజ్‌శాఖ సమావేశానికి హాజరుకాకపోవడంపై ఎంపీడీవో అసహనం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, జడ్పీటీసీ నర్సింలు, మండల కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్‌మోహినోద్దిన్, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ గంగాసాగర్ పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌ని కలిసిన ఐఎంఏ వైద్యులు



ఎంపీని కలిసిన ఐఎంఏ వైద్యులు

పెద్దబజార్, జూన్ 21: నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ఎంపీ అర్వింద్ ధర్మపురిని శుక్రవారం ఆయన నివాసంలో ఐఎంఏ వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శి కొట్టూరు శ్రీశైలం, కోశాధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్, సీనియర్ వైద్యులు రామ్మోహన్‌రావు, జయని నెప్రూా, రమాదేవి, వినోద్‌గుప్త, డీఎల్ఎన్ స్వామి, రవీంద్రనాథ్, జలగం తిరుపతిరావు, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది



రోదిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

బోధన్‌రూరల్,జూన్21: రోడ్డు ప్రమాదంలో గురువారం మృతిచెందిన బోధన్ రూరల్ విద్యుత్తు శాఖ ఏఈ రవిచంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్‌లో నిర్వహించిన రవిచంద్ర అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. అనంతరం మౌనం పాటించి నివాళులు అర్పించారు. డీఈలు వెంకట రమణ, ముక్తార్‌ఉన్నారు.

మహిళా శక్తి అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జూన్ 21: మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సమగ్ర కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో మహిళా శక్తి కార్యక్రమం అమలు సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 14 రకాల కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టు పనిని వారికే అప్పగించిందన్నారు. మహిళా శక్తి కింద మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్స్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ, పౌల్ట్రీ మదర్ యూనిట్స్, సంచార మత్స్య విక్రయ అవుట్ లెట్‌లు, మిల్క్ పార్లర్స్, మీసేవా, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్‌లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కస్టం హైరింగ్ కేంద్రాలు వంటి 14 రకాల కార్యక్రమాలు చేపట్టేందుకు మండలాల వారిగా కార్యచరణ రూపొందించాలన్నారు. ఇట్టి కార్యచరణ ప్రకారం వివిధ మండలాల్లోగల మహిళా సమాఖ్యలోని స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యచరణకు శ్రీకారం చుట్టాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మూడు మాసాలు గడిచినందున యూనిట్ల గ్రౌండింగ్‌కు సత్వర చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లతో మాట్లాడి యూనిట్లు గ్రౌండ్ చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ తరగతులకు ఔత్సాహికులైన క్రియాశీలక మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, డీఆర్‌డీవో సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్, పశుసంవర్ధక శాఖ అధికారి జనార్ధనచారి, మెప్మాపీడీ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. బాలిక మృతి



ట్రాక్టర్ బోల్తా ఘటనలో మృతి చెందిన బాలిక

పెద్దకొడప్‌గల్, జూన్ 21: కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం జుక్కల్ చౌరస్తా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 161పై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన ఒడ్డెరులు జుక్కల్ మండలం కౌలాస్ గ్రామశివారులో ఉన్న ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకుని వస్తుండగా.. వారు ప్రయత్నిస్తున్న వెగంగా వెళ్తూ ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ బాలిక మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన ఒడ్డెరుల కుటుంబాలు శుక్రవారం జుక్కల్ మండలం కౌలాస్ గ్రామశివారులో ఉన్న ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు ఓ ట్రాక్టర్‌లో 20 మంది బయల్దేరారు. ఉదయం ఎల్లమ్మ ఆలయం వద్దకు చేరుకున్న వీరు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని సాయంత్రం సమయంలో తిరిగి బిచ్కుందకు వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ జుక్కల్ గేట్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అంజలి (11)పై ట్రాక్టర్ ఇంజన్ పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనలో మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది, పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ ఇంజన్ కింద ఉన్న బాలిక మృతదేహాన్ని క్రేన్‌ను సహాయంతో బయటికి తీశారు. మృతురాలి తండ్రి గురువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జుక్కల్ ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

నేడు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

సుభాష్‌నగర్, జూన్ 21: నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని నూతన మున్సిపల్ కార్యాలయంలో నగర మేయర్ దండు నీతూకిరణ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 11గంటల నుంచి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. కౌన్సిల్ సమావేశానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త హాజరుకానున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తొలత బీజేపీలో ఉన్న నాయకులు మళ్లీ బీజేపీ పార్టీలో చేరారు. దీంతో బీజేపీ పార్టీకి 26 మంది కార్పొరేటర్లు అయ్యారు. గత కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ లేకపోవడంతో బీజేపీ కార్పొరేటర్లు సమస్యలు లేవనెత్తిన పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో మెజార్టీ బీజేపీకి ఉండటంతో సమస్యలపై గళం ఎత్తే అవకాశం ఉంది. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశాలు ప్రతీసారి తూతూ మంత్రంగానే జరిగాయి. గతంలో అధికార పార్టీకి సంబంధించిన కార్పొరేటర్లు ఎక్కువగా ఉండటంతో సమస్యలను వినిపించేలోపే గొడవలు జరిగేవి. చివరకు మెజార్టీ అభిప్రాయంతో ఎజెండా అంశాలను ఆమోదించేవారు. ప్రస్తుతం మెజార్టీ సభ్యులు బీజేపీ వారు కావడంతో అభివృద్ధిపై గట్టిగా చర్చ జరిగేందుకు అవకాశం ఉంది. బీజేపీ కార్పొరేటర్లు నగర అభివృద్ధికి జనరల్ ఫండ్‌ను ఇవ్వాలన్న డిమాండ్‌ను వినిపించనున్నారు. గత పాలనలో డివిజన్‌కు కోటి రూపాయల నిధులపై చర్చించేందుకు పట్టుబట్టనున్నారు. అంతేకాకుండా ప్రజాపాలన దరఖాస్తులు కొత్త రేషన్‌కార్డులు, గృహజ్యోతిపై చర్చలేవనెత్తే అవకాశం ఉంది. గత సమావేశాల్లాగే చర్చ జరుగకుండానే మమా అనిపిస్తారా అనేది వేచి చూడాలి. నగరంలో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా వాటిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా టౌన్‌ప్లానింగ్ అధికారులపై అనేక ఆరోపణలు ఉన్నా వీరిపై చర్యలు తీసుకోవడం లేదంటూ సోషల్ మీడియాలో ఆరోపణలు వస్తున్నాయి. నగర పాలక సంస్థలో 9 నుంచి 10 సంవత్సరాల పాటు ఒకేచోట పనిచేస్తున్నారని అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. మున్సిపల్ ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కౌన్సిల్ సమావేశంలోనైనా టౌన్ ప్లానింగ్ అధికారులపై బీజేపీ కార్పొరేటర్లు చర్చకు లేవనెత్తనున్నారు. దీనికి అధికార పక్షం చర్చకు అవకాశం ఇస్తారా అనేది తేలనుంది.

బీజేపీ నేతలు తమ వైఖరిని మార్చుకోవాలి

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్

నిజామాబాద్ అర్బన్, జూన్ 21: రాష్ట్ర ప్రభుత్వంచే నియమించబడి ప్రభుత్వ సలహాదారు హోదాలో అధికారులతో షబ్బీర్‌అలీ సమీక్ష నిర్వహిస్తే బీజేపీ నేతలు జీర్ణించుకోలేక విమర్శలు చేయడం సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ అన్నారు. ప్రభుత్వంలో హోదాలో ఉన్న వ్యక్తి ప్రజల సమస్యల గురించి సమావేశాలు నిర్వహించడం సాధారణమన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం షబ్బీర్ అలీని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సలహాదారుగా నియమించారని, అలాంటప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు అధికారులతో సమీక్షించడం సర్వసాధారణమని, అది జీర్ణించుకోకుండా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ విమర్శలు చేయడం సరికాదన్నారు. ముందుగా ఎమ్మెల్యే తన ప్రవర్తనను మార్చుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ సలహాదారు హోదాలో సమీక్ష పెట్టే అర్హత షబ్బీర్ అలీకి ఉందని రాజకీయాలు మాని అర్బన్ అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి పెడితే బాగుంటుందన్నారు. అర్బన్ నియోజకవర్గంలో ఓడినప్పటికీ షబ్బీర్ అలీ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలకు సేవ చేసేందుకు క్యాంప్ ఆఫీస్‌ను ప్రారంభిస్తే దానిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ధన్‌పాల్ సూర్యనారాయణ బీజేపీ ఎమ్మెల్యే కాదని అర్బన్ ఎమ్మెల్యే అని ప్రజలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందడమే కాకుండా ఇప్పుడు కూడా ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. రాజకీయాలు మాని నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషిచేయాలని తాము కూడా సహకరిస్తామన్నారు. రాజకీయ పరిజ్ఞానం లేకుండా ప్రభుత్వం వచ్చిన ఆరునెలల్లో ఏమి చేసిందని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తున్నారని మూడునెలలు ఎన్నికల కోడ్ ఉంటే ఎలా అభివృద్ధి పనులు సాధ్యమో జవాబు చెప్పాలన్నారు.

పాఠశాలల్లో ఘనంగా యోగా దినోత్సవం



ఫ్యూచర్ లైన్ కిడ్స్ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



విశ్వవికాస్ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని పలు పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల్లో ఘనంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లోగల స్నేహ సొసైటీలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో నగర మేయర్ నీతూకిరణ్, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారిణి రసూల్‌బీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగా అనేది పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప వరమన్నారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగ విద్యార్థులు యోగాసనాలు చేసి అబ్బురపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతి, కార్యదర్శి సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ లైన్ కిడ్స్ స్కూల్‌లో...

నగరంలోని ఆర్యనగర్‌లోగల ఫ్యూచర్ లైన్ కిడ్స్ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు యోగా నేర్పడం ద్వారా వారు దృఢంగా మారే అవకాశం ఉందని ప్రిన్సిపల్ ప్రియాంక అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వవికాస్ పాఠశాలలో...

నగరంలోని సాయినగర్‌లోగల విశ్వవికాస్ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల మైదానంలో విద్యార్థులు యోగా, వివిధ ఆసనాలను ప్రదర్శించారు. యోగా వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని మనస్సును, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకునేందుకు యోగా ఉపయోగపడుతుందని పాఠశాల కరస్పాండెంట్ అప్పారావు, ప్రిన్సిపల్ సుస్మితలు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

నిశిత ఇంటర్నేషనల్ స్కూల్‌లో...

నగరంలోని అమ్మ వెంచర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నిశిత ఇంటర్నేషనల్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పలు యోగాసనాలు ప్రదర్శింపజేశారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను చిన్నారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిశిత ఇంటర్నేషనల్ స్కూల్‌లో యోగా చేస్తున్న చిన్నారులు



యోగా దినోత్సవంలో మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్

కందకుర్తిలోని శ్రీరామార్చనలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే

రెంజల్,జూన్21: మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం గోదావరి తీరన శుక్రవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా అయోధ్య సీతారాం త్యాగి మహరాజ్ ఆశ్రమం నందు పౌర్ణమి సందర్భంగా శ్రీరామార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామ ప్రజలు యజ్ఞంలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

24 నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న వైద్యులు

పెద్దబజార్, జూన్ 21: తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24 నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్లు జూనియర్ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ నాగమోహన్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో తాత్కాలికంగా నిలిపివేసిన సమ్మెను తిరిగి కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సురేష్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

జీఎంసీకి రేడియోలజీ పీజీ సీట్లు

పెద్దబజార్, జూన్ 21: నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు రేడియోలజీ విభాగంలో అదనంగా 5 పీజీ సీట్లు మంజూరైనట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఎంసీఐ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. సీట్ల మంజూరుతో ప్రజలకు రేడియోలజీ విభాగంలో మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు.

కోటగిరిలో పోచారం దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటగిరి,జూన్21: మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాధర్ రావు దేశాయ్ మాట్లాడుతూ మాజీ స్పీకర్ పోచారం అధికార పార్టీలోకి రావడం తన ఆనవాయితీగా మార్చుకున్నారని విమర్శించారు. పోచారం సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రతిపక్ష నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు ఎంతగానో నలిగిపోయారని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం తన అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికే పార్టీలోకి వస్తున్నారని ఆరోపించారు. ఆయన విషయంలో అధిష్ఠానం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రావు, అనంత్, వహీద్, భీమా సాయిరెడ్డి, జంగం సాయిలు, బర్ల సాయిలు పాల్గొన్నారు.

మాజీ స్పీకర్ పోచారం వెంటే మేమంతా..

● కోటగిరిలో బీఆర్ఎస్ నాయకుల ప్రకటన



కోటగిరిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

కోటగిరి,జూన్21: బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వెంట తాము నడుస్తామని కోటగిరి ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లోని ఓ రైస్‌మిల్లులో శుక్రవారం ఆ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎజాజ్‌ఖాన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని తామంతా ఏకగ్రీవంగా స్వాగతిస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆయన పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసినప్పటికీ ఇంకా మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం సైతం పోచారం సీనియారిటీని గుర్తించి ఆయనను పార్టీలోకి స్వాగతించిందన్నారు. తామంత పోచారం వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో టపాకాయలు కాలుస్తూ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ ఏఎంసీ చైర్మన్ వహీద్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ సిరాజ్, విండో అధ్యక్షులు సిద్దు, శాంతేశ్వర్ పటేల్, అశోక్ పటేల్, తాజామాజీ సర్పంచ్‌లు సాయిబాబా, వర్ని శంకర్, నాయకులు హంగర్గ గంగాధర్, జుబేర్, సబేర్, నాగరాజు గౌడ్, రఫీ, సాదుల రమేష్, బాబు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

తాడ్వాయి, జూన్ 21: మండలంలోని కరడ్‌పల్లిలో శుక్రవారం కుక్కల దాడిలో గ్రామానికి చెందిన మర్రినిఖిల్ లేగదూడ మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో కుక్కల దాడి పెరిగిపోయిందని ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువులతో పాటు మనుషులపైన దాడిచేస్తున్నాయని తెలి పారు.

జయశంకర్ వర్ధంతిని మర్చిపోవడం సరికాదు



నివాళి అర్పిస్తున్న వైద్యనిపుణులు కేశవులు

పెద్దబజార్, జూన్ 21 : ప్రత్యేక తెలంగాణ కొరకు తన జీవితాన్ని పూర్తిగా త్యాగం చేసిన జయశంకర్ వర్ధంతిని అధికార, ప్రతిపక్ష నేతలు పట్టించుకోకపోవడం దారుణమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బి.కేశవులు అన్నారు. శుక్రవారం జయశంకర్ వర్ధంతిని కంఠేశ్వర్ చౌరస్తాలో గల జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ కేశవులు మాట్లాడుతూ సార్ చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియపర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రామిక శక్తి ఎడిటర్ రేపల్లి శ్రీనివాస్, అడ్వకేట్ సుదర్శన్ రావు, నిజామాబాద్ అభివృద్ధి వేదిక సెక్రెటరీ నర్సయ్య, రమేష్ ఉన్నారు.

జాన్కంపేట్‌లో ఉర్దూ పాఠశాల తనిఖీ

ఎడపల్లి జూన్ 21: మండలంలోని జాన్కంపేట ఉర్దూపాఠశాలలో 35 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులున్నారు. కాని 17 మందే హాజరు కావడం ఏమిటని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండలం జానకంపేటలో ప్రభుత్వ పాఠశాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు.


అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలి

• అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నసురుల్లాబాద్, జూన్ 21: మండలకేంద్రంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లాపంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు శుక్రవారం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో అమ్మఆదర్శ పనుల్లో భాగంగా పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అమ్మఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని స్థానిక పాఠశాల హెచ్‌ఎంలకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలకేంద్రంలోని నర్సరీని పరిశీలిం చారు. నర్సరీలో మొక్కలు పెరిగేలా ఎప్పటికప్పుడు పరిశీలించాలని స్థానిక మండల పరిషత్ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈవో నీలా వతి, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం చందర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గునిగిరి హన్మాండ్లు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

'మద్దతు ధరలో రైతులకు ద్రోహం చేయొద్దు'

కామారెడ్డి రూరల్, జూన్ 21: ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలలో నరేంద్రమోదీ ప్రభుత్వం మరోసారి అబద్ధాలు చెప్తూ రైతులను ద్రోహం చేస్తోందని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ విమర్శించారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ఆధర్యంలో కామారెడ్డి జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహ నం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి వ్యయం కంటే 50 శాతం ఎక్కువగా కనీస మద్దతు ధరను ఇస్తున్నామని కేంద్రం చెప్పడంలో వాస్తవం లేదన్నారు. ఖరీఫ్ పంటలకు ప్రకటించిన మద్దతు ధరలను చూస్తే ఈవిషయం స్పష్టమైపోతోందని అన్నారు. కచ్చితంగా రైతులకు లా భం అందేలా కనీసమద్దతు ధరను 50శాతాన్ని కంటే ఎక్కువగా చెల్లించాల న్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ధరవత్ మోతీరామ్, సావిత్రి, సాయిలు, గైని చిన్న సాయిలు, రోజా, రాములు, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే కేసులు

• డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి

లింగంపేట, జూన్21: ఎంబీబీఎస్, ఎండీ అర్హత కలిగిన వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపులలో మందులు విక్రయిస్తే కేసులు చే స్తామని కామారెడ్డి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండలకేంద్రంలోని మెడికల్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ మందుల దుకాణంలో నిల్వ ఉంచిన మందులకు సంబం ధించిన ఇన్‌వాయిస్ బిల్లులను, స్టాక్‌అండ్‌సెల్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందు లను విక్రయించాలని సూచించారు. నిద్రమాత్రలు, స్టెరాయిడ్స్, అన్‌వాంటె డ్ కిట్స్‌ను విక్రయించకూడదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మం దులు విక్రయించే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

దోమకొండ, జూన్21: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అంచనూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుం ది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అంచనూర్ గ్రామానికి చెంది న చిన్నారం వంశీ బైక్ నిమిత్తం రెండేళ్ల క్రితం శ్రీరామ్ ఫైనాన్స్‌లో రూ.75 వేల లోన్ తీసుకున్నాడు. ప్రతీనెల ఫైనాన్స్‌లో ఈఎంఐ కట్టగా మరో రూ. 15వేలు కట్టాల్సి ఉందని శుక్రవారం ఉదయం శ్రీరామ్ ఫైనాన్స్ నుంచి ఇ ద్దరు ఉద్యోగులు వంశీ తల్లి లక్ష్మీని బెదిరించారని తెలిపారు. డబ్బులు క ట్టకపోతే కోర్టు, పోలీస్‌స్టేషన్ నుంచి నోటీసులు పంపుతామన్నారని బెదిరి ంచారు. నాలుగు రోజుల్లో డబ్బులు కడుతామని చెప్పినా ఇంటి వద్ద పలు వురి ముందు అవమానించారని వంశీకి తల్లి వివరించింది. దీంతో కామారె డ్డిలో ఉన్న వంశీ ఇంటికి చేరుకుని అక్కడి నుంచి వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుచెప్పారు. మృతుడి తల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోడల్ మినీ ట్యాంక్‌బండ్ కోసం స్థల పరిశీలన

ఎల్లారెడ్డి, జూన్ 21: ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో ఉన్న పెద్దచెరువు వద్ద నిర్మిస్తున్న మినీట్యాంక్ బండ్‌ను మోడల్ మినీట్యాంక్ బండ్‌గా సుందరీకర ణ కోసం హెచ్ ఎండీఏ అధికారులు, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ మున్సిపల్ ఏఈ వినోద్ పెద్దచెరువు వద్ద మినీట్యాంక్ బండ్ వద్ద వాక్‌వే, చిల్డ్రన్స్ ప్లే, ఏరియా, జిమ్‌వంటి పనుల కోసం మినీట్యాంక్ బండ్ పక్కన గల స్థలాన్ని పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభించి ఎల్లారెడ్డి పట్ట ణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ప్రణాళికతో మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగిరెడ్డిపేట, జూన్21: మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన నార్ల నాగయ్య (55) ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శు క్రవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. నార్ల నాగయ్య గత 4రోజుల క్రితం గాయపడి ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొం దుతుండగా శుక్రవారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. నాగయ్య గుండెపోటుతో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. నాగయ్యపై కత్తితో దాడి జరిగినట్లు నమోదైన కేసుఇంకా విచారణలో ఉందని, విచారణ పూర్తయిన తర్వాత కేసు పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్సై రాజు తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాంల అందజేత

భిక్కనూరు, జూన్21: మండలంలోని పెద్దమల్లారెడ్డి బాలుర ఉన్నత పా ఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఎంపీటీసీ సాయాగౌడ్, మంజుల రా ములు, విండో చైర్మన్ రాజాగౌడ్ యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమ ంలో పాఠశాల హెచ్‌ఎం ప్రసన్నదేవి, సీఆర్పీ ఈశ్వర్, తదితరులు ఉన్నారు.


గురుకుల పాఠశాలలో యోగాసాలు చేస్తున్న విద్యార్థులు


మద్నూర్‌లో యోగా చేస్తున్న గ్రామస్తులు


ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలలో యోగా ఆసనాలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

• జిల్లావ్యాప్తంగా పలు సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

మద్నూర్, జూన్ 21: యోగాతో సంపూర్ణ ఆరో గ్యం, మానసికబలంతో నిత్యం యవ్వనంగా జీవిం చవచ్చని పతాంజలి యోగాశిక్షకులు జుబ్రీసంజీవ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని వాగ్దేవి ప్రై వేట్ పాఠశాలలో యోగా శిబిరంఏర్పాటు చేశారు. ఈశిబిరంలో పాల్గొన్న వారినుద్దేశించి మాట్లాడు తూ రోజూ కొద్దిసేపు యోగా చేస్తే ఆసుపత్రికి ప రుగు తీయకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని అన్నారు. శిబిరంలో మండల బీజేపీ నాయకులతో పాటు కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని పురస్కరించుకుని గురుకుల పాఠశాలతో పాటు, ఆయా గ్రామాల పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని అన్నారు.

బీబీపేట: మండలకేంద్రంలోని టీఎస్ఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా గురువు బండిరాములు ఆధ్వర్యంలో యోగా ఆస నాల వేశారు. ఎన్నో రకాల రోగాలకు యోగా అద్భుత ఔషధమన్నారు. కార్యక్రమంలో శివరాజు, సిద్ధరాములు, భూమయ్య, శ్రీహరి, ఆంజనేయులు, అనంతకుమార్, పెంటప్ప తదితరులు ఉన్నారు.

బిచ్కుంద: ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అంతర్జాతీ య యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యోగగురువు సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో యోగాసనాలు, యోగ గొప్పతనం గు రించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశా ల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, కోఆర్డినేటర్ డాక్టర్‌చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: అంతర్జాతీయ యోగా దినో త్సవం పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో ని బాన్సువాడ కోర్టు ఆవరణలో యోగా దినోత్స వం నిర్వహించారు. జడ్జి కుమారి టీఎస్పీ భార్గవి యోగాడేలో పాల్గొని యోగాసానాలు వేశారు. కా ర్యక్రమంలో యోగా గురువు ఆచార్య రఘువీర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి, సిబ్బంది తదితరులున్నారు.

బీర్కూర్, జూన్21: మండలంలోని దామరంచ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయు లు, విద్యార్థులు కలిసి యోగా దినోత్సవాన్ని ఘ నంగా జరుపుకున్నారు. యోగా శిక్షకులు అందరి చేత యోగాసనాలు వేయించారు.

నసురుల్లాబాద్: మండలంలోని సంగంలో నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి సునీల్ రాథోడ్ మాట్లాడుతూ యోగా దినోత్సవం సందర్భంగా సంఘం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లలకు కూడా యోగాసనాలు వేయించారు. అలాగే అంకోల్ తండాలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు యోగా ఆకారంలో కూర్చోని యో గాసనాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, శివరాంమందిర్ ఆ లయం ఆవరణలో శుక్రవారం యోగాసనాలు చే శారు. యోగాతో వ్యాధి నిరోధక శక్తిని పెంపొం దించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కుంచాల శేఖ ర్, బాల్‌రాజు, కృష్ణ, రాములు, ఎల్లయ్య, రవి, స త్యం, రాజిరెడ్డి, సలీం, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో భారీ వర్షం


పట్టణంలో కురుస్తున్న వర్షం

బాన్సువాడటౌన్, జూన్21: బాన్సువాడ పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపా టు కురిసిన వర్షంతో బాన్సువాడ ప్రధాన రహదారిపై నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. గత కొన్నిరోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు ఊరట కలిగించింది. వాతావరణం కొంత చల్లబడింది.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డి టౌన్, జూన్21: కామారెడ్డి రాజీవ్‌నగర్ కాలనీలోని తన సొంత ఇంటిలో షేక్ అర్బాజ్ అక్రమం గా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీ సులు, డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో రైడ్ చేయగా 40ప్లాస్టిక్ సంచులలో మొత్తం 22 క్వింటాళ్లలో పీడీఎస్ రైస్‌ను గుర్తించినట్లు తెలిపారు. షేక్ అర్బాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.

'పోచారం రాకను స్వాగతిస్తున్నాం'

బాన్సువాడటౌన్, జూన్21: మాజీస్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రా వడాన్ని స్వాగతిస్తున్నట్లు బాన్సువాడ మాజీ ఎంపీటీసీ దేవికృష్ణ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపా రు. రైతుశ్రేయస్సు, బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త నాయకులు అందరూ ఎమ్మెల్యే పోచారం రాకను స్వాగతించి సమ న్వయంతో పనిచేసి బాన్సువాడ నియోజకవర్గాన్ని వి ద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకరించాలని కోరారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘననివాళి


బీర్కూర్ కళాశాలలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బీర్కూర్, జూన్ 21: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పలువురు నా యకులు, అధికారులు నివాళులర్పించారు. బీ ర్కూర్ ప్రభుత్వజూనియర్ కళాశాలలో అధ్యాప కబృందం నివాళులర్పించింది. కళాశాల ప్రిన్సి పాల్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ స్ఫూర్తిని వివరించారు. కా ర్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, అధ్యాప కులు సౌమ్య, సావిత్రి, శ్యామ్, దేవిసింగ్, సు భాష్, నారాగౌడ్, బాలకిషన్ ఉన్నారు.

నసురుల్లాబాద్: నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యులు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీర్కూర్: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపక బృందం ఘన నివాళులర్పించారు. జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నష్టాలను, కష్టాలను తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రజల్లో ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ స్ఫూర్తినరి రగిలించారన్నారు. ఆయన ఆశించిట్లే స్వరాష్ట్ర పాలనలో తెలంగాణ దేశానికే తలమానికంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, అధ్యాపకులు సౌమ్య, సావిత్రి, శ్యామ్, దేవిసింగ్, సుభాష్, నారాగౌడ్, బాలకిషన్, రాకేష్, సతీష్ ఉన్నారు.


నసురుల్లాబాద్ ప్రాథమిక పాఠశాలలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మొదలైన లింగంపల్లి కలాన్ బ్రిడ్జి నిర్మాణ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

నాగిరెడ్డిపేట, జూన్21: మండలం లోని లింగంపల్లి కలాన్‌గ్రామం వద్ద రూ.50లక్షల 90వేలతో పోచారం ప్ర ధాన కాలువపై చేపట్టిన బ్రిడ్జి నిర్మా ణం పనులు పునఃప్రారంభమయ్యా యి. ఏడాది క్రితం ఈబ్రిడ్జి నిర్మాణం పనులకు అప్పటిఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేయగా, బ్రిడ్జి నిర్మాణం పనులు దిమ్మెల వర కు జరిగి నిలిచిపోయాయి. సుమా రు 8నెలలుగా బ్రిడ్జి నిర్మాణ పనులు సాగలేదు. దీంతో ఈనెల 10న 'నిలి చిన లింగంపల్లి కలాన్‌బ్రిడ్జి నిర్మాణ పనులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి నీటిపారు దలశాఖ ఉన్నతాధికారులు స్పందిం చారు. బ్రిడ్జి నిర్మాణం పనులను వెం టనే చేపట్టి త్వరగా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించా రు. దీంతో కాంట్రాక్టర్ పనులను తిరిగి మొదలయ్యాయి. ఇప్పటికే ది మ్మెల వరకు బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగగా స్లాబ్ పనులు మిగిలి ఉం డటంతో ప్రస్తుతం స్లాబ్ పనులు చే పడుతున్నారు. ఈనెలాఖరు వరకు బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేస్తామని ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపా రు. శుక్రవారం స్థానిక ఎంపీపీ టేకు లపల్లి వినీత, జడ్పీటీసీ మనోహర్‌రె డ్డిలు కలిసి బ్రిడ్జి నిర్మాణం పనుల ను పరిశీలించారు. వారివెంట బీఆర్ ఎస్ నాయకుడు దుర్గారెడ్డి ఉన్నారు.

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

• ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

భిక్కనూరు, జూన్21: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ఎల్లయ్య సూచించారు. శుక్రవా రం మండలంలోని కంచర్ల గ్రామంలో గల ప్రాథమికోన్న త పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కంచర్ల పాఠశాలలో చాలా రోజు లుగా ఉన్న విద్యుత్ సమస్యతో తరుచుగా బోరు చెడిపో తుందని, ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. మండల కేంద్రం లో సైతం గిద్ద హరిజనవాడకు వెళ్లే దారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంబాన్ని పక్కనకు జరపాలని సూచించినా విద్యుత్ అధికారులు స్పందించడం లేదన్నారు. దీంతో ఈ రెండు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కంచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో పాధ్యాయులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

పెద్దకొడప్‌గల్, జూన్ 21: వర్షాకాలం సీజన్ ప్రారంభమైం దని, వైద్యశాఖ సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం గా ఉండి చర్యలు చేపట్టాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావ్ వైద్యశాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం జుక్క ల్ మండలకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజ కవర్గంలోని వైద్యశాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉం డటంతోపాటు ఆయాశాఖల అధికారులతో సమన్వయం చేసు కుంటూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఆసుపత్రికి వచ్చేరోగులకు నాణ్యమైన వైద్యసేవలు అం దించాలని సూచించారు. అత్యవసరంగా రోగులకు ఆసుపత్రికి తరలించే అంబులెన్స్ సేవలకు అంతరాయం కలుగకుండా చూడాలని, సరైన సమయంలో రోగులకు అంబులెన్స్‌లు అం దేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులలో రోగులకు ఏదైనా ఆసుపత్రి నుంచి సరైన సేవలు అందడం లేదని వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. ఆసుపత్రులలో వైద్యుల కొరత ఉన్న చోట త్వరలోనే వైద్యుల నియామకాలు చేపడుతామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలో వైద్యంతోపాటు విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గుర్తుచేశారు.


జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే

వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. వ్యవసాయశాఖ అధికారు లతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున నియోజకవర్గంలోని వ్యవసాయశాఖ అ ధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు, ఎరువులు అందు బాటులో ఉన్నాయా లేదా అనే వివరాలను అధికారులను అ డిగి తెలుసుకున్నారు. రైతులకు వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే అటువంటి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అమ్మ ఆదర్శ పనుల పరిశీలన

పెద్దకొడప్‌గల్, జూన్ 21: మండలంలోని బేగంపూర్‌తండా, కాస్లాబాద్, వడ్లం, కుబ్యానాయక్ తండా, పెద్ద దేవిసింగ్‌తండా పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పథకం పనులను శుక్రవారం మండల ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సూ ర్యకాంత్ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలల్లో జరుగుతున్న అమ్మఆదర్శ పథకానికి సంబంధించిన పనులు 80శాతం పూర్తయ్యాయని, మిగతా పనులను త్వరలో పూర్తి చే యిస్తామని తెలిపారు. ఆయా పాఠశాలల్లో అమ్మఆదర్శ కమిటీ పథకం కింద నీటి సౌకర్యం, విద్యుత్ పరికరాల ఏర్పాటు, చిన్న చిన్న మరమ్మతులు చేసినట్లు చెప్పారు. బేగంపూర్ తండా పాఠశాలలో మధ్యాహ్నభోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బేగంపూర్ తండా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణజ్యోతి, కార్యదర్శి ఇందల్ తదితరులు పాల్గొన్నారు.


బేగంపూర్ తండా పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకం పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- మహారాజ
ప్రియా 70	- మనమే
ప్రియా 35	- హరోంహర

బాన్సువాడ

మహేశ్వరి	- ఓఎంజీ
వెంకటేశ్వర	- హరోంహర

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

